క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐనవోలు : మండలంలోని ఉడుతగూడెం, చెన్నారం, బండౌతపురం 11 కేవీ అగ్రికల్చర్ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం సాయంత్రం 4.00 గంటల నుంచి 6.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ రమేష్, ఇన్‌చార్జ్ ఏఈ శివకుమార్ సోమవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. నాగపురం, ఐనవోలు, లింగమోరిగూడెం, రాంనగర్ గృహ అవసరాల కనెక్షన్లతో పాటు వ్యవసాయ కనెక్షన్లు, అలాగే వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం చెన్నూర్‌కు గృహ అవసరాల కనెక్షన్లతో పాటు వ్యవసాయ కనెక్షన్లు కలిగిన వారికి విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడి మృతి


యాదగిరి(ఫైల్)

ఐనవోలు : వృత్తిలో భాగంగా కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కుతున్న గీతకార్మికుడు ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని రాంగనర్‌లో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్లకొండ యాదగిరి(49) రోజుమాదిరిగానే సోమవారం సాయంత్రం కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి పడగా తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ యాదగిరి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఖానాపురం : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని బుధరావుపేట శివారులో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మంగళవారిపేటకు చెందిన లింగయ్య ద్విచక్ర వాహనంపై నర్సంపేట వైపు వెళ్తుండగా ప్రమాదవశాత్తు లారీ తగిలి కిందపడిపోయాడు. స్థానికులు లింగయ్యకు చికిత్స నిమిత్తం నర్సంపేటకు తరలించారు. లింగయ్య స్వల్ప గాయాలతో బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



ఖిలా వరంగంల్: వరంగల్ ఉర్సు సుభాష్‌నగర్‌లోని నాగేంద్రస్వామి దేవాలయం ప్రాంగణంలో సోమవారం అయ్యప్ప మహాపడి పూజ వైభవంగా జరిగింది. అయ్యప్పస్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నాగమయ్య అయ్యప్ప కుటీరం ప్రతినిధి బత్తిని సుభాష్ గౌడ్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన పూజారి జాగర్లపూడి శ్రీరామ్‌శర్మ నేతృత్వంలో భారీ వేదికపై పదినెట్టాంబడిపై స్వామివారిని ప్రతిష్ఠించి అభిషేకాలు నిర్వహించారు. పడిపూజకు అయ్యప్ప భక్తులు భారీగా తరలివచ్చారు. అనంతరం నేత్రపర్వంగా అఖండ మహాపడిని ముట్టించి అయ్యప్పకు 18రకాల నైవేద్యాలు సమర్పించారు. అయ్యప్ప భక్తుడు బత్తిని సుభాష్‌గౌడ్ మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, ఈఓ ఆర్.కమల, సొసైటీ అధ్యక్షుడు కేడల జనార్దన్, కేడల పద్మ, కార్పొరేటర్లు మరుపల్లి రవి, పోశాల పద్మ, స్వామి, బత్తిని సతీష్‌గౌడ్, కె.నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

అయ్యప్పకు గోక్షీరాభిషేకం

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలోని హరిహర పుత్రుడు అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారికి సోమవారం గోక్షీరాభిషేకం నిర్వహించారు. అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు సాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో అర్చకులు అయ్యప్పకు నిత్య పూజలతో పాటు పంచామృతాలు, గోవు పాలతో అభిషేకం జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి అన్నదానం చేశారు. ఆలయ అర్చకులు యల్లంబట్ల క్రాంతికుమార్ శర్మ, అయినవోలు రాధాకృష్ణ శర్మ, టంటం హరిస్వామి, ఆలయ ఇన్‌చార్జ్ చొక్కారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

దుగ్గొండి : మండలంలోని కేశవాపురం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం రెండో రోజుకు చేరుకోగా ఉత్సవాల్లో భాగంగా దేవతారాధన, మహా కుంభస్థాపన, అగ్నిప్రతిష్ఠ, మూలమంత్ర హవనం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కేశవాపురం, పెంచకలపేట, నీరుకుళ్ల, లక్ష్మీపురం, బంధంపల్లి, తదితర గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో చేరుకుని పూజలు చేశారు. అనంతరం వేంకటేశ్వరస్వామిని శేషవాహనంపై ఊరేగిస్తూ గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు.

ఉత్సాహంగా హోలీ వేడుకలు

ఆత్మకూరు : హోలీ వేడుకల్లో పాల్గొన్న యువత, గ్రామస్తులు



ఎల్కతుర్తి : హోలీ సంబురాలు జరుపుకొంటున్న యువకులు



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో..



జిల్లా వ్యాప్తంగా సోమవారం హోలీ వేడుకలు అంబరాన్నంటాయి. చిన్నా పెద్దా అనే బేధం లేకుండా అందరూ రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు సంబరాల్లో పాల్గొన్నారు.
- సాక్షి నెట్‌వర్క్


ఐనవోలు : హోలీ సంబురాల్లో చిన్నారులు..


కవులాపూర్ : ఉట్టి కొడుతున్న యువకులు


శాయంపేట : హోలీ సంబురాల్లో జర్నలిస్టులు


వేలేరు : హోలీ ఆడుతున్న చిన్నారులు


నర్సంపేట : హోలీ వేడుకల్లో బీజేపీ నాయకులు


నర్సంపేట రూరల్ : శివాని స్కూల్‌లో..


వర్ధన్నపేట : హోలీ సంబురాల్లో హమాలీలు


సంగెం : హోలీ ఆడుతున్న యువకులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


సంగాల రాజు(ఫైల్)

దామెర : బైక్ అదుపుతప్పి తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం మృతి చెందాడు. ఈ సంఘటన దామెర మండలంలోని ల్యాదెళ్ల లో చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ల్యాదెళ్ల గ్రామానికి చెందిన సంగాల రాజు గురువారం ఒగ్లాపూర్‌లోని అతని బంధువు మృతిచెందడంతో అక్కడికి వెళ్లివస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామం సమీపంలోని ఎస్సారెస్పీ కెనాల్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి రాజు కిందపడ్డాడు. ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి రాజు మృతి చెందాడు. మృతుని తండ్రి సంగాల శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై అశోక్ తెలిపారు.

'అరూరి'కి మద్దతు


అరూరి రమేష్‌కు మద్దతు తెలుపుతున్న చార్టెడ్ అకౌంటెంట్లు

హన్మకొండ: వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను చార్టెడ్ అకౌంటెంట్ బృందం కలిసింది. కాజీపేట ప్రశాంత్‌నగర్‌లోని స్వగృహంలో రమేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో చార్టెడ్ అకౌంటెంట్లు కొయ్యడ రాజు, భగవాన్, సుజిల్, వినీల్, వంశీ, రామకృష్ణ, దరహాస్, శ్రీపాల్ పాల్గొన్నారు.

క్రైస్తవులు ఆదర్శంగా జీవించాలి


ప్రమాణం చేస్తున్న సైరస్ కుమార్

నల్లబెల్లి : బైబిల్ వ్యాఖ్యానుసారం క్రైస్తవ కుటుంబాలు ఆదర్శంగా జీవించాలని ప్రసంగికులు రెవరెండ్ బీపీ.సైరస్ కుమార్, రెవరెండ్ ఎస్తేర్ రాణి కోరారు. స్థానిక పాస్టేట్ చైర్మన్ రెవరెండ్ ఈపీ.ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక సీఎస్ఐ దేవాలయంలో సోమవారం నిర్వహించిన ఆదర్శమైన కుటుంబ సదస్సుకు సైరస్ కుమార్, ఎస్తేర్ రాణి ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. భార్యాభర్తలు పొరుగు వారికి ఆదర్శంగా నిలిచేలా జీవించాలని సూచించారు. ధనాపేక్ష, స్వార్థం లేకుండా ఒకరికొకరు కట్టుబడి ఏకాభిప్రాయంతో జీవనం సాగించాలని చెప్పారు. ఎలాంటి అరమరికలు లేకుండా ఇద్దరూ ఒకే మనస్సులా జీవితం గడుపుతూ ఇతరులకు ఆదర్శప్రాయంగా నిలవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులను, తోబుట్టువులను ప్రేమానురాగాలతో చూసుకోవాలని తెలిపారు. అనంతరం ఆదర్శవంతమైన జీవితం గడుపుతామంటూ భార్యభర్తలతో ప్రమాణం చేయించారు. సదస్సులో నల్లబెల్లి, లక్ష్మీపురం, రేకంపల్లి గ్రామాలకు చెందిన క్రైస్తవ దంపతులతోపాటు వరంగల్ జిల్లా గ్రూప్ సెక్రెటరీ ఆకుల అశోక్, పాస్టేట్ సెక్రెటరీ నాగెల్లి ప్రకాశ్, ఎంపీటీసీ జన్ను జయరాజు, కనుకం నవీన్, పరికి రత్నం, కల్లెపల్లి రఘువరణ్, కొలగాని సాంబయ్య, ఈదునూరి బుచ్చయ్య, నాగెల్లి సాల్మాన్, స్త్రీల మైత్రీ సభ్యులు సుమలత, సువర్ణ పాల్గొన్నారు.

భారత్ వికాస్ పరిషత్ కమిటీ ఎన్నిక



విద్యారణ్యపురి: హనుమకొండలోని డఫోడైల్స్ హైస్కూల్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) ఓరుగల్లు శాఖ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ డి.సుధీర్‌కుమార్, ఉపాధ్యక్షులుగా వి.గోవిందరాజులు, చంచల్ అగర్వాల్, కార్యదర్శిగా కె.సత్యనారాయణ, కోశాధికారిగా బి.వెంకటరెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. సమావేశంలో రిటైర్డ్ ప్రొఫెసర్ గుజ్జుల నర్సయ్య, ప్రొఫెసర్ సంజీవ, బాధ్యులు చంద్రదేవ్, డాక్టర్ సమ్మిరెడ్డి, బీఎస్.రెడ్డి, జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా రామభద్రస్వామి కల్యాణం


రామభద్రస్వామి - సీతాదేవి కల్యాణాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కమలాపూర్ : హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని మర్రిపల్లి గుట్టపై రామభద్రస్వామి ఆలయంలో సోమవారం రామభద్రస్వామి–సీతాదేవి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. రామభద్రస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మర్రిపల్లిగూడెంలోని రంగనాయకుల దేవాలయం నుంచి సీతాదేవి– రామభద్రస్వామిని మర్రిపల్లి గుట్టకు తీసుకొచ్చి మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల నడుమ కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. అనంతరం భక్తులకు మహాఅన్నదానం నిర్వహించారు. ఈ వేడుకకు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న సభ్యులు

ధర్మసాగర్ : హోలీ పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలో సోమవారం త్రైతసిద్ధాంతం–ప్రబోధసేవా సమితి ఇందూజ్ఞానం వేదిక హుజూరాబాద్ కమిటీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాల్గుణమాసంలో వచ్చే పౌర్ణమి రోజున హోలీని జరుపుకొంటామని, ఇందులో ఆధ్యాత్మిక వివరం ఉందన్నారు. భగవద్గీతలో చాతుర్వర్ణంలో మనుషుల గుణాలు, స్వభావాన్ని బట్టి తామసులు, రాజసులు, సాత్వికులు యోగులు అని నాలుగు రకాలుగా ఉంటారని అన్నారు. వర్ణం అంటే మనిషి స్వభావం అని అర్థం అన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గోపి, కుమార్, రామస్వామి, పద్మ, శ్రీదేవి, చారి, బిందు, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాల జాతర షురూ..


ప్రభబండిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

- తరలివచ్చిన రాజకీయ ప్రభబండ్లు

గీసుగొండ: కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి గోవిందా అంటూ భక్తుల నినాదాలు.. రాజకీయ ప్రభబండ్ల హోరు మధ్య కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతర సోమవారం వైభవంగా ప్రారంభమైంది. హోలీ పండుగ ముగించుకొని భక్తులు రాత్రి జాతరకు భారీగా తరలివచ్చారు. రాత్రి 10 గంటలకు కొమ్మాల స్టేజీ వద్ద అల్లం బాలకిశోర్‌రెడ్డి సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన భారీ ప్రభను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడుగుర్రాల (బొమ్మగుర్రాల) వాహనంపై ఎమ్మెల్యే జాతరలోకి ప్రవేశించారు. ఇతర పార్టీల నాయకులు బోడకుంట్ల ప్రకాశ్, డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభ బండితో ఆయా పార్టీల నాయకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అయితే పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉన్నా.. అవేమి పట్టించుకోకుండా ప్రభలు, డీజేలతో జాతరకు తరలివచ్చారు.


ఎండ్లబండిలో జాతరకు వెళ్తున్న భక్తులు


విద్యుత్ వెలుగుల్లో కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం (ఇన్‌సెట్) గుట్ట చుట్టూ తిరుగుతున్న ప్రభబండి

భక్తిభావంతో మెలగాలి:రేవూరి

భక్తులు రాజకీయ గొడవలకు పాల్పడకుండా భక్తిభావంతో స్వామివారిని దర్శనం చేసుకోవాలని ఎమ్మెల్యే రేవూరి కోరారు. జాతర ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ బీమగాని సౌజన్య, జిల్లా కాంగ్రెస్ నాయకుడు తాడ కొంరారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కూసం రమేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం



ఐనవోలు : తిరుమల తిరుపతి దేవస్థానం హిందు ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో పాల్గుణమాస పౌర్ణమి హోలీని పురస్కరించుకుని మండలంలోని పున్నేలు రామాలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ధర్మప్రచార పరిషత్ మండల కన్వీనర్, పూజారి శివకుమార్ శాస్త్రీ గ్రామస్తులతో కలిసి వ్రతం నిర్వహించారు. సుమారు 150 మంది మహిళలు పూజలో పాల్గొన్నట్లు నిర్వాహకుడు అమరవాది సారంగపాణి తెలిపారు. సత్యనారాయణస్వామి వ్రతానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడం సంతోషంగా ఉందన్నారు. ప్రభాకర్‌రావు, దేవేందర్‌రావు, గోపాల్‌రావు, సంపత్‌రావు, రాజు, మోహన్‌రావు, శ్రీధర్ పాల్గొన్నారు.

ఎర్రగట్టు స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- వైభవంగా వేంకటేశ్వర స్వామి శోభాయాత్ర
- మొక్కులు సమర్పించుకున్న భక్తులు


స్వామివారి శోభాయాత్ర

హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. హసన్‌పర్తి – భీమారం గ్రామాలు సంయుక్తంగా ఐదురోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నాయి. ఆయా గ్రామాల నుంచి అలివేలు మంగ వేంకటేశ్వర స్వాముల ప్రతిమలను రథాలపై ప్రతిష్ఠించి గ్రామాల పురవీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం 5గంటలకు కోలాటాల మధ్య ప్రారంభమైన శోభాయాత్ర రాత్రి 9గంటలకు ఎర్రగట్టు దేవాలయానికి చేరుకుంది.

వైభవంగా శోభా యాత్ర

స్వామివారి శోభాయాత్ర సందర్భంగా భక్తులు ఎదురొచ్చి మొక్కులు సమర్పించుకున్నారు. మేళతాళాలు, కోలాటాల మధ్య శోభాయాత్ర సాగింది. కార్యక్రమంలో కార్పొరేటర్లు గురుమూర్తి శివకుమార్, జక్కుల రజిత, అరుణకుమారి, ఆలయ ఈఓ కిషన్‌రావు, ధర్మకర్తలు వెంకటస్వామి, రమణ, సురేష్, కాంగ్రెస్ నాయకులు గడ్డం శివరాం, జె.రవి, వెంకన్న, ఆకుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.


భీమారం ఆలయంలో పూజలు

ఏనుగు రథాల ఊరేగింపు

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని దేవన్నపేట నుంచి ఎర్రగట్టు గుట్ట వరకు ఏనుగు ప్రతిమల రథాల ఊరేగింపు సాగింది. ఊరేగింపును భక్తులు ఆసక్తిగా తిలకించారు. దేవన్నపేకు చెందిన సూరం వంశానికి చెందిన వారు ప్రతిఏటా ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు.


ట్రాక్టర్‌పై ఏనుగు రథం

క్రీడల్లో గెలుపోటములు సహజం

హసన్‌పర్తి: క్రీడల్లో గెలుపోటములు సహజమని కిట్స్ కళాశాల అదనపు కార్యదర్శి వొడితల సతీష్‌బాబు అన్నారు. కిట్స్ కళాశాల మైదానంలో రెండురోజుల పాటు నిర్వహించిన కిట్స్ ట్రోఫీ పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి సమగ్ర వికాసానికి క్రీడలు దోహదపడుతాయని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడల ద్వారా సృజనాత్మక నైపుణ్యాలు పెంపొందుతాయని చెప్పారు. వివిధ విభాగాల్లో గెలుపొందిన జట్లకు ట్రోఫీ అందించారు. కిట్స్ ఏఓ రమేష్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

హర్షం ..

న్యూశాయంపేట: ఢిల్లీ జేఎన్‌యూ విద్యార్థి సంఘం ఎన్నికల్లో వామపక్ష కూటమి విజయంపై ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలీఉల్లాఖాద్రీ హర్షం వ్యక్తం చేశారు. అన్ని స్థానాల్లో కూటమి సత్తా చాటిందన్నారు.